క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ నిర్ణయంపై పునః సమీక్షించాలి

విశాఖ లీగల్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు నాయుడు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదుపై పలువురు న్యాయవాదులు విస్మయం చెందారు. పేద, బడుగు బలహీన వర్గాలు,వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నెలనెలా ఒకటో తేదీన పెన్షన్లు వలంటీర్లు పింఛన్లు అందిస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సీనియర్ న్యాయవాది వి. కాళిదాసు రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అతి ప్రాచీనమైనదని పేర్కొన్నారు. 1977లో అప్పటి జనతా ప్రభుత్వం దేశవ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఆరోగ్య, సామాజిక సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సామాజిక కార్యకర్త పేరుతో గ్రామాల్లో ప్రభుత్వ, వైద్య సేవలు, అందించడానికి ఈ వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ సేవలను మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్ వ్యవస్థీకరించి ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. లక్షలాదిమంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడే అవకాశం ఉన్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కాళిదాసు రెడ్డి కోరారు.

'బ్రాహ్మణులపై నిర్లక్ష్యం తగదు'

బీచ్ రోడ్డు: బ్రాహ్మణులకు సీట్లు ఇవ్వడంలో రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని రాష్ట్రీయ విప్ర వారధి చైర్మన్ నూకల సూర్య ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన సిరిపురంలోని ఒక హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు బ్రాహ్మణులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక వేళ అలా స్పందించకుంటే బ్రాహ్మణులు అన్ని నియోజకవర్గాల్లోను స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి కూడా వెనకాడబోమన్నారు.

ఎన్నికల ఉల్లంఘనపై ప్రత్యేక కాల్ సెంటర్

ఆరిలోవ: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో ఎన్నిక నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఫిర్యాదులు చేయడానికి జీవీఎంసీ జోన్–3 జోనల్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గం ఎన్నికల నోడల్ అధికారి జె.విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ఫిర్యాదులను ఈ కాల్ సెంటర్ ద్వారా స్వీకరిస్తామన్నారు. కాల్‌సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. 0891–2746314, 91544 05435, 91544 05462 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని ఆమె కోరారు.

ఘనంగా వీఎంసీ కళాశాల వార్షికోత్సవం



ఆచార్య బాలమోహన్‌దాస్‌ను సత్కరిస్తున్న వీఎంసీ కళాశాల ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కళాశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భవిష్యత్ సమాజ అవసరాలకు అనుగుణంగా యువత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. కేవలం సబ్జెక్ట్ విజ్ఞానమే కాకుండా నైపుణ్యం, సాంకేతికతలపై పట్టుసాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ విజయరవీంద్ర, ప్రిన్సిపాల్ ఆచార్య జగదీశ్వరరావు, తదితరులు ఆచార్య బాలమోహన్‌దాసును సత్కరించారు.

వావ్!

- 15వ వార్డులో రూ.7.74 కోట్లతో అభివృద్ధి
- ఇప్పటి వరకు 64 పనుల పూర్తి
- కొండవాలు ప్రాంతాల్లో కుళాయిలు, మెట్ల మార్గాల నిర్మాణం
- అందుబాటులోకి పార్కులు, ఓపెన్ జిమ్



కొండపైకి నిర్మించిన మెట్ల మార్గం

మద్దిలపాలెం : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తూర్పు నియోజకవర్గంలోని పలు వార్డులు ప్రస్తుతం మౌలిక వసతులతో కళకళలాడుతున్నాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రగతి బాట పట్టాయి. గత టీడీపీ హయాంలో 15వ వార్డులో అభివృద్ధి జాడ లేకుండాపోయింది. ప్రజలు మౌలిక సదుపాయాలకూ నోచుకోలేదు. అటువంటి సమయంలో 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం.. 2021లో నగరంలో కార్పొరేషన్ ఎన్నికలు జరగడంతో అభివృద్ధికి బీజం పడింది. జీవీఎంసీ 15వ వార్డులో చేపట్టిన ప్రగతి పనులు వావ్ అనిపించేలా ఉన్నాయి. రోడ్లు, కాలువలు, కొండపైకి మెట్ల మార్గాలు, రక్షణ గోడలు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణాలతో అభివృద్ధి శరవేగంగా జరిగింది. వార్డులో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు ఆధునికీకరణతో కళకళలాడుతున్నాయి. మూడేళ్లలో వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులకు అక్షరాలా రూ.7.74 కోట్లు జీవీఎంసీ నిధులు కేటాయించారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య అభ్యర్థన మేరకు అధిక శాతంలో నిధులు మంజూరు చేసి వార్డు అభివృద్ధికి సహకరించారు.

రూ.2.03 కోట్లతో తారురోడ్ల నిర్మాణం

వార్డులో ప్రధాన రహదారులతో పాటు, కాలనీల్లో అంతర్గత రోడ్లకు రూ.2.03 కోట్లు వెచ్చించారు. 5.5 కిలోమీటర్ల మేర తారురోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో అస్తవ్యస్తంగా గోతులమయంగా ఉన్న రోడ్లకు తారు వేయడంతో అద్దంలా మెరిసిపోతున్నాయి. వార్డులో ఏడు చోట్ల తారురోడ్ల నిర్మాణం చేపట్టారు.



భూగర్భ డ్రైనేజీ పనులు

రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు

వార్డులో రూ.1.50 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్లను నిర్మించారు. గతంలో సరైన రోడ్లు లేక చిన్నపాటి వర్షానికి బురద మయంగా మారి రాకపోకలకు నానా అవస్థలు పడేవారు. వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీలకు కొత్త కళ సంతరించుకుంది.

రూ.1.56 కోట్లతో కాలువలు

కాలనీల్లో కాలువల ఆధునికీకరణ చేపట్టారు. ఇందుకు రూ.1.56 కోట్లు వెచ్చించారు. కాలువలు, రోడ్లను ఒకేసారి నిర్మించారు. దీంతో కాలువల్లో మురుగునీరు నిలిచిపోకుండా కిందకి పోతోంది.



అద్దంలా మెరుస్తున్న తారురోడ్డు

రూ.25 లక్షలతో బస్ షెల్టర్ల నిర్మాణం

వార్డులో రెండు చోట్ల కొత్తగా బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టారు. ఇందుకు రూ.25 లక్షలు వెచ్చించారు. ప్రభుత్వం ఆధునిక సదుపాయాలు కల్పించి ప్రయాణికుల మన్ననలు పొందుతోంది.

రూ.2.35 కోట్లతో మరమ్మతులు

కొండవాలు ప్రాంతాలలో మెట్ల మార్గాలు నిర్మించారు. తాగునీటి సదుపాయం కల్పనకు 200 కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేశారు. కాలనీలో శిథిలమైన కాలువలు, భవనాల మరమ్మతులు చేపట్టారు. మూడు చోట్ల పార్కులను అభివృద్ధి చేశారు. వాటిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం ఈ పనులకు రూ.2.35 కోట్లు వెచ్చించారు.

ఆదర్శంగా 15వ వార్డు అభివృద్ధి



15వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నాం. ఈ వార్డులో మూడేళ్లలో రూ.7.74 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో వార్డులో ప్రాంతాలకు అతీతంగా అన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కొండవాలు ప్రాంతాల సమస్యలపై ఎక్కువగా దృష్టి సారించాం. మెట్ల మార్గాలు, తాగునీటి సదుపాయం కల్పించాం. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించింది.

– అప్పారి శ్రీవిద్య, 15వ వార్డు కార్పొరేటర్

కొండవాలు ప్రాంతాల అభివృద్ధి బాగుంది



15వ వార్డులో కొండవాలు ప్రాంతంలో నివసించే మా సమస్యలు వర్ణనాతీతం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సమస్యలకు పరిష్కారం లభించింది. మెట్లు నిర్మించారు. కొండపైకి తాగునీరు తీసుకువెళ్లడానికి నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఏకంగా కొండపైకి కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– నూతలపాటి ఉషా, దుర్గానగర్

భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



సింహాద్రి పురం కాలనీలో పదేళ్లుగా భూగర్భ డ్రైనేజీ సమస్యతో సతమతమవుతున్నాం. కార్పొరేటర్ శ్రీవిద్య చొరవతో కోట్లాది రూపాయల వ్యయంతో కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. దుర్వాసన సమస్య నుంచి బయటపడ్డాం.

– ఉుగత మేర్సీ, సింహాద్రి పురం కాలనీ

కొత్త రోడ్లతో వార్డు కళకళ



వార్డులో రోడ్లు పాడై అధ్వానంగా తయారయ్యాయి. వాహనాల నడపాలంటే నానా యాతన పడేవాళ్లం. ఇప్పుడు రోడ్లను ఆధునికీకరించారు. దీంతో ఏం చక్కాగా కొత్త రోడ్లపై రయ్‌మంటూ వెళ్తున్నాం. అంతేకాకుండా కాలనీలో సీసీ రోడ్లు కూడా నిర్మించారు. దీంతో కాలనీలకు కొత్త రూపు వచ్చింది.

– గొలగాని త్రినాథ్, వెంకోజీపాలెం

వీళ్లతో ఎలా నెగ్గుకురావాలి!

- తూర్పులో కలవని 'పొత్తులు'
- అయోమయంలో వెలగపూడి
- ప్రచారానికి ముఖం చాటేస్తున్న టీడీపీ



ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ప్రచారంలో కనిపించడం లేదు. మరోవైపు ప్రచారానికి ముఖం చాటేస్తున్న సొంత పార్టీ కార్యకర్తలతో వెలగపూడి రామకృష్ణబాబు ఆందోళనలో పడ్డారు. ఓ పక్క అధికారి పార్టీ నుంచి బలమైన ప్రత్యర్థి బరిలో ఉండగా.. కూటమి నాయకులు సహకరించకపోవడంతో మదనపడుతున్నారు. మూడు సార్లు అవలీలగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఈ సారి విజయం ప్రశ్నార్థకంగా మారిపోయిందంటూ ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. కొద్ది రోజులుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎక్కడికక్కడ ప్రజలు హారతులిస్తూ బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థి వెలగపూడి వెన్నులో వణుకుపుడుతోంది. నియోజకవర్గంలో ఆయన కొద్ది రోజులుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. అన్ని వార్డుల్లో టీడీపీ నాయకులు వర్గాలుగా విడిపోవడంతో ఏదో ఒక వర్గం నాయకులు ప్రచారానికి డుమ్మా కొడుతున్నారు. మరోవైపు పొత్తులో భాగమైన జనసేన, బీజేపీ కార్యకర్తలు కూడా మాకెందుకులే అన్నట్టు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గంలో బీజేపీ, జనసేన కార్యకర్తలు ఒక్కసారి కూడా వెలగపూడి ప్రచారంలో పాల్గొనడంలేదు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో జనసేన పార్టీలో బలమైన నాయకుడు లేకపోవడంతో అక్కడక్కడా ఉన్న ఆ పార్టీ కార్యకర్తలు ఒక్కొక్కరుగా వైఎస్సార్‌సీపీలో చేరిపోతున్నారు. ఈ పరిణామాలన్నింటిని చూస్తున్న వెలగపూడి కొద్ది రోజులుగా మదనపడుతున్నారట. ఈ ఎన్నికల్లో కలిసిరాని పరిస్థితిలో ఎలా బయటపడాలో అంటూ తలపట్టుకొంటున్నారట. ఈ బాధ కార్యకర్తలపై చూపిస్తూ చిర్రుబుర్రులాడుతున్నారట.

విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని వీసీటెక్, టాలెంట్ కంప్యూటర్స్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించనున్నట్టు శనివారం సంస్థ ప్రతినిధి డాక్టర్ మణిభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్ష పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ శిక్షణ అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 98484 18582 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తో సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జనం కోసం.. జనంలోనే పేరిట నిర్వహిస్తున్న పాదయాత్ర శనివారం 17వ వార్డులో కొనసాగింది. 76వ రోజు 17వ వార్డు సెక్టార్–1లో వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, పార్టీ శ్రేణులతో కలిసి ఎంవీవీ ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. గత ఐదేళ్ల పాలనతో వంద శాతం ఇది రుజువైందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొంత కాలంగా నియోజకవర్గంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తే రాష్ట్రంతో పాటు విశాఖపట్నం అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అవకాశాలు, సంక్షేమం దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, పార్టీ నాయకుడు గేదెల నాగరాజు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బాబూరావు

మార్కెండేయులకు అభినందనలు



ఎంవీవీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెండేయులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన దేవరకొండ మార్కెండేయులకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందనలు తెలిపారు. ఇటీవల మార్కెండేయులను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్కెండేయులు శనివారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెండేయులను ఎంవీవీ అభినందించడంతో పాటు కార్మికుల పక్షాన అనేక సమస్యల పరిష్కారానికి దశాబ్దాలుగా అందించిన సేవలను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీని 2024 ఎన్నికల్లో విజయం ముంగిట నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. మార్కెండేలు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీతో పాటు విశాఖ ఎంపీ బొత్స ఝాన్సీల గెలుపే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు తెలిపారు.

పేదల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలు



సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంపీ బాబూరావు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ

ఆరిలోవ: పేదల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు తెలిపారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ జీవీఎంసీ 12వ వార్డు పరిధి సూర్యతేజానగర్‌లో శనివారం ×మేము సిద్ధం, మా బూతు సిద్ధం≣సభను వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్ల బాబూరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ పేదలను గుర్తించి ఉన్నత పదవులలో నిలబెడుతున్నారన్నారు. సామాజికంగా, రాజకీయంగా సమన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి పేదల అభివృద్ధి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్రంలో ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు, జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తూర్పు నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి మద్యం వ్యాపారం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సిద్ధం సభలో ప్రజలు

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం సొంతం

యువత నచ్చిన రంగంలో రాణిస్తున్నారు

ఏయూ క్యాంపస్: నేటి తరం యువత మనసుకు నచ్చిన రంగంలో రాణిస్తున్నారని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. శనివారం ఏయూ టీఎల్ఎన్ సభామందిరంలో ఏయూ జర్నలిజం విభాగంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సును పూర్తి చేసిన విద్యార్థుల ఫొటోగ్రఫీ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గీసిన పలు ఫోటోలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ఆయన తిలకించి, విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా చూసి ప్రశంసించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడుతూ ఆసక్తికి అనుగుణంగా నేటితరం యువత ముందుకు సాగుతున్నారన్నారు. ఫొటోగ్రఫీలో మెలకువలను నేర్చుకుని నైపుణ్యం సాధించి దీనిని ఒక వృత్తిగా మలచుకోవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో యువత ముందుకు సాగితే విజయం వారికి సొంతం అవుతుందన్నారు. నేటి తరం యువతకు నైపుణ్యాలే పెద్ద సందగా మారుతున్నాయన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ఏయూ విద్యార్థులు ప్రతిభావంతులన్నారు. ఫొటోగ్రఫీ, జర్నలిజం కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. వీటిలో ప్రవేశాల సంఖ్య పెంచాలని వినతులు వస్తున్నాయన్నారు. విభాగంలో వసతులను మరింత పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి ఆచార్య సి.ఎం.వినయకుమార్, బీవోఎస్ చైర్మన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, ఆచార్య చల్లా రామకృష్ణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను విభాగం తరపున సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగనుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది.



ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఉపాధిలో ఏయూ విద్యార్థుల ముందంజ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఉపాధి అవకాశాలను సాధించడంలో ఏయూ విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు. తాజాగా ఏయూ సౌత్ క్యాంపస్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ)లో బీఈడీ, ఎంఈడీ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు పలు సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ఓక్ రిడ్జ్ ఇంటర్నేషనల్, శ్రీవిశ్వ జూనియర్ కళాశాల, రిషి డిగ్రీ కళాశాల, భాష్యం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, నారాయణ విద్యా సంస్థలు నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు ఏయూలోని 200 మంది విద్యార్థులు హాజరవగా రికార్డు స్థాయిలో 170 మంది ఎంపికయ్యారు. వీరికి అత్యధిక వార్షిక వేతనంగా రూ 6.25 లక్షలు లభించడం పట్ల వీసీ సంతోషం వ్యక్తం చేశారు. ప్లేస్‌మెంట్స్ సాధనకు కృషి చేసిన ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, తదితరులు అభినందించారు. ఇప్పటి వరకు ఏయూ సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, న్యాయ కళాశాలల పరిధిలో 190 సంస్థలు ప్రాంగణ నియామకాలకు వచ్చాయని 850 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వారిలో సైన్స్ కళాశాల విద్యార్థులకు రూ.13 లక్షలు, ఆర్ట్స్ విద్యార్థులకు రూ.7.8 లక్షలు, ఫార్మసీ విద్యార్థులకు రూ.6 లక్షలు, న్యాయ విద్యార్థులకు రూ.4.5 లక్షలు వార్షిక వేతనంగా లభించాయని ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి తెలిపారు.

అంతర్జాతీయ గణిత సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య కె.పి.ఆర్.శాస్త్రి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగంలో శనివారం రెండు రోజుల అంతర్జాతీయ గణిత సదస్సు ప్యూర్, అప్లైడ్ అండ్ ఇంజినీరింగ్ మ్యాథమేటికల్ సైన్సెస్ అంశంపై ప్రారంభమైంది. ఈ సదస్సుకు గణితశాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.అనూరాధ కామేశ్వరి అధ్యక్షత వహించారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య సి.హెచ్.శ్రీనివాసరావు సదస్సు ఆవశ్యకతను వివరించారు. ఉత్తరాంధ్ర మ్యాథమేటికల్ సైన్సెస్ చైర్మన్ కె.పి.ఆర్.శాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. యువత పరిశోధకులకు ఉపయుక్తంగా ఈ సదస్సును నిర్వహించామన్నారు. ఉత్తరాంధ్ర మ్యాథమేటికల్ సైన్సెస్ అధ్యక్షుడు ఆచార్య కె.కె.ఎం.శర్మ గణితశాస్త్ర ప్రాముఖ్యతను వివరించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ ఆచార్యులు జి.పి.రాజశేఖర్ గణితశాస్త్ర అనువర్తనాలను వివరించారు. సదస్సులో ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమేటికల్ సైన్సెస్ ఆచార్య ఎస్.మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఏయూ గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమంలో ఆచార్య పి.డి.ఎస్.శ్రీనివాసు, ఆచార్య జి.నానాజీరావు, ఆచార్య ఎస్.రవికుమార్, రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.